# అమ్మో గుహలు...

**అడుగు పెడితే చెమటలు పట్టాలి!**
**కన్నుమలిగితే కనిపిస్తామో లేదో తెలియకూడదు!!**
**వెలుతురు కోసం వెతుకులాట...**
**ప్రాణం కోసం పాకులాట...**
**అలాంటి ప్రదేశమే అసలైన టూరిస్ట్ ప్లేస్ కొందరికి. ఈ మధ్య విడుదలైన సూపర్‌హిట్ సినిమా 'మంజుమ్మల్ బాయ్స్'లో ఓ ప్రమాదకర గుహలాగే... ప్రపంచ వ్యాప్తంగా డేంజర్ కేవ్స్ చాలా ఉన్నాయి. అడుగు పెడితే తిరిగి రాలేనివీ, తప్పిపోతే తెలుసుకోలేనివీ, పట్టు తప్పితే మట్టి పాల్జేసేవి... ఇలా ఒక్కోటీ ఒక్కో ప్రమాదాన్ని తమలో పొదవుకున్నాయి. ఆందోళన ఆసక్తుల సంగమంగా సాగే వాటి సంగతులు...**




## భూమి లోపల ఎవరెస్ట్





**లోపలికి** వెళ్లడమే తెలియాలి... కానీ దాని లోతెంతో తెలియకూడదు... ఎంట్రన్స్ ఎక్కడుందో తెలిసినా... ఎగ్జిట్ ఎక్కడున్నది అర్థం కాకూడదు... అప్పుడే అసలైన కిక్... అనుకునే వాళ్లు ఉజ్బెకిస్థాన్‌లోని 'డార్క్‌స్టార్ కేవ్' చూడాల్సిందే. మంచు ముద్దలా ఉండే ఈ గుహ ఎన్ని కిలోమీటర్ల పొడవు ఉందో ఇప్పటి దాకా ఎవరూ కనిపెట్టలేకపోయారు. వెళ్లే దారి నిండా మంచు మాత్రమే కాదు, అక్కడక్కడా నారింజ, పసుపు, ఎరుపులాంటి విభిన్న వర్ణాల సరస్సులు, పెద్ద జలపాతాలు కనిపిస్తాయి. ఈ గుహ లోపలికి ఇప్పటి దాకా సాహసవంతులతో కూడిన ఎనిమిది బృందాలు మాత్రమే వెళ్లాయి. అందులో భూ ఉపరితలానికి కిలోమీటర్ లోతులో 25 కిలోమీటర్ల పొడవున్న సొరంగాన్ని వీళ్లలోని బృందం ఒకటి కనిపెట్టగలిగింది. అయితే ఇది ఇంకా ఎంత లోతు, ఎంత పొడవు ఉన్నదన్న విషయం మాత్రం అంచనా వేయలేకపోతున్నారు. అందుకే దీన్ని 'అండర్ గ్రౌండ్ ఎవరెస్ట్ (భూగర్భ ఎవరెస్ట్)'గా పిలుస్తారు.

## వెళ్లడమే కానీ రావడం ఉండదు...




**మృత్యు గుహ(కేవ్ ఆఫ్ డెత్)గా** కోస్టారికాలోని 'లా కుయెవా డి లా ముయెర్టె'కి పేరు. అక్కడి పోస్ అగ్నిపర్వతం అంచున, మూడు మీటర్ల పొడవు, రెండు మీటర్ల లోతుతో ఉంటుందీ గుహ. అయితే ఇందులోకి ప్రవేశించిన ఏ జీవీ తిరిగి ప్రాణాలతో బయటికి రాలేదు. మామూలుగా చూస్తే ఓ చిన్న బిలంలా కనిపించే ఇది మృత్యు కుహరంలా మారడానికి కారణం అందులో అధిక మోతాదులో ఉండే కార్బన్ డై ఆక్సైడ్ వాయువే. మామూలుగా ఆ దారిలో వెళ్లే మేకలు, పిల్లులు, పక్షుల్లాంటివి లోపలికి వెళ్లిన కొద్ది సేపట్లోనే చనిపోతుంటాయి. మనుషులు కూడా దాని దగ్గరికి వెళ్తే ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అయ్యేవారట. దాదాపు అపస్మారక స్థితికి పోయి, మృత్యువు అంచుల్ని చూశారట. దీంతో ఇక్కడ అధ్యయనం జరిపితే ఎలాంటి రంగు, రుచి, వాసన కలిగి ఉండని బొగ్గు పులుసు వాయువు ఇక్కడ గంటకు 30 కేజీల చొప్పున విడుదల అవుతుందని తేలింది. ఇంకేం, జీవిప్రాణం తీసేందుకు ఇంతకు మించి మరో విషయం ఏం కావాలి! ఒక టూరిస్ట్ కాంప్లెక్స్ ప్రాంతంలో ఉండే దీని గురించి తెలిపేందుకు గైడ్‌లు పెద్ద మంట ఉన్న కాగడాను లోపలికి జొప్పిస్తుంటారు. అది నోటితో ఊదినట్టు చప్పున ఆరిపోవడం అక్కడి కార్బన్ డై ఆక్సైడ్ గాఢతకు చిహ్నం. ఈ ప్రాంతంలోని ఖనిజ నిల్వలు.. అగ్ని పర్వత మాగ్మాకు సంబంధించిన అత్యధిక ఉష్ణోగ్రతలు, పీడనాలకు గురవడం ఈ విష వాయువు విడుదలకు కారణం అవుతున్నదని శాస్త్రవేత్తల అంచనా. అమ్మో అంటూనే, అందరూ దీన్ని చూసేందుకు దూరంగా గుమిగూడుతుంటారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కదూ!

